సిర్పూర్(టీ) ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 26 : సిర్పూర్(టీ) ఎంపీపీ చునార్కర్ సువర్ణపై ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇవ్వడంతో మంగళవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణతో పాటు మరో నలుగురు ఎంపీటీసీ సభ్యులు కలిసి ఎంపీపీ సువర్ణపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలనినీ కోరుతూ ఈ నెల 5న కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌కుమార్‌కు దరఖాస్తు అందజేశారు. దీంతో ఈ నెల 27న అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించేందుకు ఎంపీటీసీ సభ్యులకు అధికారులు నోటీసులు అందజేశారు. ఈ మేరకు ఎంపీపీ చునార్కర్ సువర్ణ హైకోర్టును ఆశ్రయించడంతో సిర్పూర్(టీ) ఎంపీపీ అవిశ్వాసం తీర్మానాన్ని నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇచ్చింది.

29న దేశవ్యాప్త ఆందోళనలు విజయవంతం చేయాలి

తిర్యాణి,ఫిబ్రవరి 26: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 29న దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగం మొగిళీగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బోగే వెంకటేశ్, కినాక జంగు, అట్కపురం సత్తయ్య, భీమళ్ల దేవేందర్, రవి, రాజు పాల్గొన్నట్లు తెలిపారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి

రెబ్బెన, ఫిబ్రవరి 26: రాంపూర్‌లో బీటీ రోడ్డు పనులు ప్రారంభించేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు కోసం నిధులు మంజూరు అయి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారన్నారు. ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి రాంపూర్ గ్రామస్తుల బాధలు తీర్చాలని తెలిపారు. మండల సహాయ కార్యదర్శి చాపిడి శివ, ఉపాధ్యక్షుడు చల్లూరి కృష్ణ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

బీఆర్ఎస్ హయాంలో విద్యాభివృద్ధికి పెద్దపీట

ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతుల భవనం

- సకల హంగులతో తరగతి గదులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిర్యాణి, ఫిబ్రవరి 11: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కళాశాల, పాఠశాలల్లో సకల సౌకర్యాలను కల్పిస్తూ విద్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళశాలలో సరిపడా గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా రెండేళ్ల క్రితం అప్పటి జడ్పీ చైర్ పర్సన్, ప్రస్తుల ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు రూ.కోటి నాబార్డు నిధులతో కళాశాలకు అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కళాశాలలో అటెండర్, వాచ్‌మన్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ పనులు పూర్తి కావడంతో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించడంతో హాజరుశాతం పెరిగినట్లు అధ్యాపకులు తెలిపారు. ఈ యేడు ఆ సౌకర్యం లేక పోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలి

కళాశాలలో అదనపు తరగతి గదులను నిర్మించడం ఎంతో సంతోషంగా ఉంది. కనీ స సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కళాశాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలి. మండలకేంద్రం వరకే ఆర్టీసీ బస్సు రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మధ్యాహ్న భోజన సౌకర్యం లేకపోవడంతో చాలామంది ఒకపూటనే కళాశాలకు వస్తున్నారు.

-జుగ్నాక మమత, ఇంటర్ ద్వితీయ (లింగిగూడ)

పోస్టులను భర్తీ చేయాలి

ఈ యేడు కళాశాలలో 215 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రథమ సంవత్సరంలో 121 మంది, ద్వితీయ సంవత్సరంలో 94 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో విద్యనభ్యసిస్తున్నారు. కళాశాలకు అటెండర్, వాచ్‌మన్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఈ పోస్టులను భర్తీ చేయాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన కార్యక్రమం సతిరిగి ప్రారంభిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

-లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్

ఎంతో ఉపయోగకరంగా ఉంది

కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. గతంలో గదులు సరిపోకపోవడంతో తరగతి గదుల్లోనే ప్రయోగశాలను నిర్వహించాల్సి వచ్చేది. దీంతో విద్యార్థులతో పాటు విద్యార్థులు, అధ్యాపకులకు సైతం ఎంతో ఇబ్బందిగా ఉండేది. నూతన భవనం అందుబాటులోకి రావడంతో రసాయన, భౌతికశాస్త్ర ప్రయోగాలకు, రెగ్యులర్ తరగతులు నిర్వహించడానికి పూర్తి స్థాయిలో అవకాశం ఏర్పడింది.

-అనిల్ కుమార్, రసాయన శాస్త్ర అధ్యాపకుడు

కళాశాల అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్, తాజా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్(ఫైల్)

ప్రజావాణి అర్జీల సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆర్డీవో సురేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కెరమెరి మండలం పిప్రి గ్రామానికి చెందిన నాయిడి చిన్న రాజం, కొమ్రె లస్మక్క అడ ప్రాజెక్టు ముంపునకు గురి అయిన పిప్రి గ్రామ నాయక్ కోడ్ గిరిజనులకు కమ్యూనిటీ హాల్‌కు ప్రభుత్వం మంజూరే చేసిన టీన్ షెడ్డును వెంటనే నిర్మించాలని అరీజ అందజేశారు. ఆసిఫాబాద్ మండలం వాడిగూడకు చెందిన దుర్గం రాకేశ్ డిగ్రీ పూర్తి చేసిన తనకు ఉపాధి కల్పించాలని కోరాడు. ఆసిఫాబాద్ కసాబ్ వాడికి చెందిన ఈదులవాడ విజయ్‌కుమార్ తనకు అనువంశికంగా సంక్రమించిన భూమికి సంబంధించి పట్టా పాసు పుస్తకం మంజూరు చేసి రైతుబంధు ఇప్పించాలని తెలిపారు. బెజ్జూరు మండలం మర్తిడికి చెందిన తాళ్ల రామయ్య 18 సంవత్సరాల క్రితం గ్రామ శివారులో భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నానని, ప్రస్తుతం కొందరు తన భూమిని ఆక్రమించుకున్నారని సమగ్ర విచారణ జరిపి తనకు పట్టా పాసుపుస్తకం మంజూరు చేసి న్యాయం చేయాలని విన్నవించాడు. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్‌నవేగంకు చెందిన జాడి రాజయ్య తనకు ప్రధానమంత్రి కిసాన్ డబ్బులు ఇప్పించాలని అర్జీ సమర్పించాడు. ఆసిఫాబాద్ మండలం వాడిగూడకు చెందిన కుడిమేత రాజ్యలక్ష్మి డిగ్రీ పూర్తి చేసి కులాంతర వివాహం చేసుకున్నానని ఉపాధి కల్పించి ఆదుకోవాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం కొండపల్లికి చెందిన దుర్గం పవన్‌కుమార్ మీ సేవ కేంద్రం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. సిర్పూర్ టీ మండలానికి చెందిన వడ్డె మల్లేశ్ వేంపల్లి గ్రామపంచాయతీ కారోబార్ గా విధులు నిర్వహిస్తున్నానని, తనకు నియామక పత్రం ఇప్పించాలని విన్నవించాడు. లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన రవీందర్ తహసీల్ కార్యాలయంలో దినసరి వేతనం కింద పనిచేస్తున్నానని పెండింగ్‌లో ఉన్న వేతనాన్ని ఇప్పించాలని దరఖాస్తు అందజేశాడు. చింతల మానేపల్లి మండలం కర్జవల్లికి చెందిన ఆగయ్య వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు అందజేశారని తెలిపారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పరిశీలన కోసం పంపించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మోదుగ

వాంకిడి, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంతో పాటు రాజీవ్ నగర్, బీ కోసార, ఆర్లీ, ఖమాన, నార్లపూర్ తదితర గ్రామాల రోడ్ల వెంట విరగ బూసిన మోదుగపూలు బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ మోదుగ పూలు ఫిబ్రవరి,మార్చి నెలల్లో విరగబూస్తాయి. హోలీ పండుగ పూట మోదుగుపూలను రంగుల తయారీలో వినియోగిస్తారు. ఈ మోదుగ పూలతో ఎన్నో రకాల ఆయుర్వేద మందులు తయారు చేస్తారు.

రోడ్డు వెంట ఆకర్షిస్తున్న మోదుగ చెట్టు పూలు

అటవీ సంపద సంరక్షణకు 'కంట్రోల్ బర్నింగ్'

కెరమెరి: సాంగ్వీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారి నజీర్‌అలీ

తిర్యాణి, ఫిబ్రవరి 26: వేసవిలో ఎలగడులని నివారించి అడవులతో పాటు జంతు సంపదను కాపాడేందుకు కంట్రోల్ బర్నింగ్ పనులు చేపట్టనున్నట్లు తిర్యాణి ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, డిప్యూటీ రేంజర్ సంతోష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గిన్నెధరి, తిర్యాణి రేంజి పరిధిలోని తిర్యాణి, మొర్రిగూడ, కన్నేపల్లి, రోంపల్లి, చోపిడి, దేవాయిగూడ సెక్షన్ల పరిధిలోని అడవుల్లో ఉన్నతాధికారుల ఆదేశాను సారం కంపా నిధులతో కంట్రోల్ బర్నింగ్ పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ప్రమాదావశాత్తు ప్రతీ యేట అడవులకు నిప్పు (ఎలగడి) తగలడంతో అటవీ సంపదతో పాటు వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అడవుల్లో కంట్రోల్ బర్నింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల తో అడవి, క్రిమి కీటకాలు, గుడ్లు, గూళ్లకు కట్టే పక్షుల ఆవాస ప్రాంతాలకు సైతం ఎలాంటి హానీ ఉండదన్నారు. జంతువులకు సైతం ఎలాంటి ఆహార కొరత లేకుండా ఉంటుందన్నారు.

అడవుల్లో నిప్పు పర్యావరణానికి హానికరం

కెరమెరి, ఫిబ్రవరి 26: అడవుల్లో నిప్పు పెట్టడం పర్యావరణానికి హానికరమని కెరమెరి ఎఫ్ఆర్‌వో సయ్యద్ మజారొద్దీన్ అన్నారు. సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పపూల సేకరణకు వెళ్లినప్పుడు గానీ, ఏ ఇతర కారణాలతోనైనా అడవుల్లో అగ్ని ప్రమాదం జరగకుండా చూడాలని తెలిపారు. వేసవిలో ఎండిపోయిన ఆకులు రాలిపోయి ఉండడంతో నిప్పు త్వరగా అంటుకుంటుందన్నారు. దీంతో అడవులకు నష్టం కలగడంతో పాటు సర్వ జీవరాసులకు ముప్పు ఏర్పడుతుందని చెప్పారు. అడవి, జంతువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉంటూ ప్రకృతిని రక్షించాలని కోరారు. ఇక్కడ ఎఫ్‌బీవోలు తిరుపతి, నజీర్ అలీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీ బాలాజీ జాతర హుండీ ఆదాయం రూ.36,17,371

రెబ్బెన, ఫిబ్రవరి 26: గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర ద్వారా రూ.36,17,371 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణ అధికారి రమేశ్, సీఎఫ్‌వో వేణుగోపాల్‌గుప్తా, ఆలయ ఈవో బాపు రెడ్డి తెలిపారు. గంగాపూర్ జాతర ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరుగగా సోమవారం హూండీ లెక్కింపు నిర్వహించారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.1,31,640, సులభ దర్శనం ద్వారా రూ.1,72,500, శీఘ్ర దర్శనం ద్వారా రూ.3,60,000, కేశఖండనం ద్వారా రూ.4,590, కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయం ద్వారా రూ.1,90,000, ప్రసాద విక్రయం ద్వారా రూ. 3,65,000, తైబజార్ ద్వారా రూ.9,01,000, పార్కింగ్ ద్వారా రూ.2,22,000, కొబ్బరిముక్కల ద్వారా రూ.18 వేలు, హుండీ ద్వారా రూ.12,52,791, నగదు, 12 గ్రాముల బంగారం, 13.700 గ్రాముల వెండి వచ్చినట్లు వెల్లడించారు. ఆలయ చైర్మన్ లెండుగురే జయరాం పర్యవేక్షించగా, ఏఎస్ఐ లక్ష్మణ్ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

తహసీల్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న తుండుందెబ్బ నాయకులు

తిర్యాణి,ఫిబ్రవరి 26: మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంతరావు, డివిజనల్ అధ్యక్షుడు గేడం సుభాష్ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి వివిధ పనుల కోసం తహసీల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాడాల్సిన సిబ్బంది పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి కాలయాపన చేస్తున్నారన్నారు. తహసీల్దార్‌తో పాటు కీలకమైన ఉద్యోగులు స్థానికంగా ఉండడం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల తనిఖీలు లేకపోవడంతో ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇక్కడ మండలాధ్యక్షుడు తోడసం భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సహాయం చేయడంలో సంతృప్తి

లింగాపూర్, ఫిబ్రవరి 26: నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని అభినవ్ సర్దార్ ఫౌండేషన్ సభ్యుడు జాటోత్ దవిత్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన జాదవ్ బుల్లిబాయి-విజేశ్ దంపతుల కూతురు జాదవ్ మహేశ్వరి వివాహానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేసి మాట్లాడారు. ప్రతి పేదింటి ఆడబిడ్డను తమ ఇంటి ఆడపడుచుగా భావించి తమవంతుగా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జాదవ్ అముల్, వికాస్, రాథోడ్ భరత్ పాల్గొన్నారు.

మహేశ్వరి వివాహానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న అభినవ్ సర్దార్ ఫౌండేషన్ సభ్యులు

పది విద్యార్థులకు వీడ్కోలు

కౌటాల: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కౌటాల, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో కరస్పాండెంట్ శాగంటి యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, వార్షిక పరీక్షలు మంచిగా రాసి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ వార్షికోత్సవం

హోమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26: జిల్లా కేంద్రంలోని ఉత్తరవాహిని నది తీరాన కొలువుదీరిన అభయాంజనేయస్వామి విగ్రహ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి అభిషేకం, నవగ్రహ సహిత గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.కార్యక్రమంలో ధర్మపురి వెంకటేశ్వర్లు, వనం మధుకర్, ఎకిరాల శ్రీనివాస్, గుండ వెంకన్న, డాక్టర్ రమేశ్, గోపాల్‌నాయక్, రాజశేఖర్,పిన్న వివేక్, శ్రీనివాస్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మహేశ్

దహెగాం, ఫిబ్రవరి 26: దహెగాంలో మండల కేంద్రానికి చెందిన భీమనాదుల జగదీశ్ జ్ఞాపకార్థం సోమవారం క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను జగదీశ్ సోదరుడు మహేశ్ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భీమనాదుల మహేశ్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో పారిశుధ్య పనులు

నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

వాంకిడి, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని ఇంద్రానగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సమీపంలో సోమవారం అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు.'ప్రత్యేక' పారిశుధ్యం ఏదీ..? కథనాన్ని ఈ నెల15న గురువారం నమస్తే తెలంగాణ ప్రచురించింది. దీనికి స్పందించిన ఎంపీవో ఖాజా అజీజొద్దీన్ పారిశుధ్య పనులు చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దహెగాం, ఫిబ్రవరి 26: చౌక గ్రామపంచాయతీ పరిధిలోని యేనెగూడెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, నాయకులు చెమ్మకారి రమేశ్, లోనారి రాజేశ్వర్, చెమ్మకారి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఈ –కేవైసీ చేసుకోవాలి

వాంకిడి, ఫిబ్రవరి 26 : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు ఖాతాల్లో జమ కాకపోతే వెంటనే ఈ –కేవైసీ చేయించుకోవాలని వాంకిడి ఏవో మిలింద్ సోమవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. మండలంలో ఇప్పటి వరకు ఈ–కేవైసీ చేయించుకోని రైతులు 470 మంది ఉన్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ లేదా మీ సేవ సెంటర్లలో బయోమెట్రిక్ విధానం ద్వారా ఈ –కేవైసీ చేయించుకోవచ్చని రైతులకు సూచించారు. గ్రామాల్లోకి వచ్చే క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా ఆధార్ సీడింగ్, ఈకేవైసీ చేయించవచ్చని పేర్కొన్నారు.